సాక్షి
అనంతపురం
గురువారం • 6 • జూలై • 2023



చీనీ టన్ను రూ.21 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21 వేలు పలికాయి. మార్కెట్‌కు 885 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



చెంతకే పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, మూడేళ్లలోపు చిన్నారులకు ఆగస్టు నుంచి పౌష్టికాహారం ఇంటికే పంపిణీ చేయనున్నారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.8°/21.6°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడ్డాయి. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

25 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 25 మండలాల పరిధిలో 6.9 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. రాయదుర్గం 31.2 మి.మీ, విడపనకల్లు 20.8, బెళుగుప్ప 18.6, ఉరవకొండ 14.8, కణేకల్లు 13, ఆత్మకూరు 12.8, నార్పల 12, కళ్యాణదుర్గం, కంబదూరు 11.4, బుక్కరాయసముద్రం 10.4, రాప్తాడు 10.2 మి.మీ నమోదు కాగా మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. జూలై నెల సాధారణం 63.9 మి.మీ కాగా ఇప్పటి వరకు 10 మి.మీ నమోదైంది. గతనెల జూన్‌లో సాధారణం 61 మి.మీ కాగా 25 శాతం తక్కువగా 45.8 మి.మీ నమోదైంది. ఈ వర్షాలకు రైతులు అక్కడక్కడా వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న తదితర ఖరీఫ్ పంటలు విత్తుకుంటున్నారు. జూలై నెలంతా పంటల సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఫెయిలైన విద్యార్థులపై దృష్టి పెట్టండి



ఫెయిల్ అయిన విద్యార్థులను అడ్మిషన్ చేయిస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులపై హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని డీఈఓ ఎం.సాయిరామ్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా సప్లిమెంటరీ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులను తిరిగి పాఠశాలలో పునఃప్రవేశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా బుధవారం అనంతపురంలోని రాజేంద్ర మునిసిపల్, కస్తూర్బా మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో 11 మంది విద్యార్థులను చేర్పించారు. డీఈఓ మాట్లాడుతూ ఫెయిల్ అయిన విద్యార్థులను ఏడాదంతా వృథా చేసుకోకుండా బడులకు పంపేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. డీఈఓ అలెస్కో బాలమురళి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇద్దరిపై వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ చర్యలు

- పార్టీ నుంచి వై.మధుసూదన్‌రెడ్డి సస్పెన్షన్
- చామలూరు రాజగోపాల్‌కు షోకాజ్ నోటీసు జారీ



పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: జిల్లాలో ఇద్దరు నాయకులపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య బుధవారం మీడియాకు వెల్లడించారు. ఇటీవల పార్టీకి నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన మాజీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అలాగే శింగనమల నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి చామలూరు రాజగోపాల్ గత నెలలో పార్టీ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడినందున.. వారం రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వాలని షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు. పార్టీకి నష్టం కల్గించే విధంగా ఎవరు ప్రవర్తించినా కచ్చితంగా వారిపై క్రమశిక్షణ చర్యలుంటాయని స్పష్టం చేశారు.

ఇంటర్ ప్రవేశాల కౌన్సెలింగ్ పూర్తి

అనంతపురం రూరల్. ఉమ్మడి జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాలు, కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ నెల 4న బాలురకు బి పప్పూరు గురుకులంలో, 5న బాలికలకు కురుగుంట కళాశాలలో ప్రవేశపరీక్ష మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. 89 మంది విద్యార్థినులు, 54 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురుకులాల ప్రవేశాలు పూర్తి పారదర్శకతతో మెరిట్ ఆధారంగా భర్తీ చేశామన్నారు. ఎవరూ ఇతర మార్గాల ద్వారా సీట్ల భర్తీకి ఆశించి మోసపోవద్దని విద్యార్థులకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

శవ రాజకీయం 'జేసీ'

- సీఐ ఆనందరావు ఆత్మహత్యను అస్త్రంగా చేసుకున్న వైనం
- ప్రజల్లో ఉనికి కోసం మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పాకులాట
- ప్రశాంత వాతావరణానికి ముప్పు తెచ్చే విధంగా వ్యాఖ్యలు
- తీరు మార్చుకోని జేసీ ప్రభాకర్‌రెడ్డిపై సర్వత్రా విమర్శలు



జేసీ వైఖరితో తాడిపత్రిలో స్లాబ్ దశలో ఆగిపోయిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు



జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి: ఇటు నియోజకవర్గంలోను, అటు టీడీపీ క్యాడర్‌లోను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఉనికి కోల్పోయారు. ఎలాగైనా ఉనికిని చాటుకునేందుకు, తాడిపత్రిలో పైచేయి సాధించాలనే కుట్రపూరిత ఆలోచనతో సీఐ ఆనందరావు ఆత్మహత్యను రాజకీయాస్త్రంగా వాడుకుంటున్నారు. ఈయన చవకబారు, శవరాజకీయాలపై ప్రజలు ఛీదరించుకుంటున్నారు. కుటుంబ కలహాలతో అర్బన్ సీఐ ఆనందరావు మూడు రోజుల క్రితం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. సాక్షాత్తు ఎస్పీ శ్రీనివాసరావే తాడిపత్రికి వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆత్మహత్యకు గల కారణాలను ఆరా తీశారు. సీఐ ఆత్మహత్యకు రాజకీయ, ఉన్నతాధికారుల ఒత్తిళ్లు కారణం కాదని, కుటుంబ సమస్యల వల్లే ప్రాణం తీసుకున్నాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు గురించి మీడియాకు వెల్లడించారు. అయితే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాత్రం సీఐ ఆత్మహత్యకు రాజకీయ రంగు పులిమి, హంగామా చేయడం విస్మయం కలిగిస్తోంది. టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గీయులు ఘర్షణ పడిన సమయంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారన్న చిన్నచూపుతో సీఐ ఆనందరావును దుర్భాషలాడారు. 'వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై తన వర్గీయులు దాడులు చేస్తారు చూస్తావా.. అడ్డుకోవడం నీవల్ల అవుతుందా' అంటూ హేళన చేస్తూ బెదిరించారు. ఈ విషయమై సీఐ అప్పట్లోనే స్థానిక డీఎస్పీతో పాటు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

పోలీసులంటే జేసీ బ్రదర్స్‌కు ఎప్పుడూ చిన్నచూపే..

జేసీ సోదరులు అధికారంలో ఉన్నపుడు మాట వినని పోలీసులను దుర్భాషలాడడమే కాకుండా, వారి వాహనాలను దహనం చేయడంతో పాటు ఏకంగా పోలీస్ స్టేషన్‌కే తాళాలు వేయించారు. అలాంటి జేసీ సోదరులు ఇప్పుడు పోలీసులంటే ఎనలేని గౌరవం ఉన్నట్లు మాట్లాడటం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం సీఐ ఆత్మహత్యను వాడుకుంటున్నారు. సీఐ చావుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఒత్తిళ్ల కారణమంటూ ఆరోపణలు చేస్తూ ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిలో అలజడులు రేపేందుకు కుట్రలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు..

తాడిపత్రి పట్టణంలోని ఆంజనేయస్వామి మాన్యంలో నివసిస్తున్న పేదలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ప్రజలకు మేలు చేయడం గిట్టని జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుయాయులచే హైకోర్టులో కేసులు వేయించి ఇళ్ల పట్టాల పంపిణీకి అడ్డుపడ్డారు.

- అంబేడ్కర్ నగర్‌లోని మున్సిపల్ స్థలంలో ఆరోగ్య ఉప కేంద్రం భవనం నిర్మించడాన్ని జేసీ ప్రభాకర్‌రెడ్డి జీర్ణించుకోలేక తన అనుచరుడైన టీడీపీ కౌన్సిలర్‌తో హైకోర్టులో పిటిషన్ వేయించి పనులు అడ్డుకున్నారు.
- తాడిపత్రిలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పోలీసు ఉన్నతాధికారులతో చర్చించి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ఒప్పించారు. ఎస్పీ కూడా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే తన సొంత డబ్బుతో స్టేషన్ నిర్మాణాన్ని చేపట్టడం జీర్ణించుకోలేక టీడీపీ కౌన్సిలర్‌తో జేసీ ప్రభాకర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేయించి స్టే తెప్పించారు. దీంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు ఆగిపోయాయి.

మున్సిపల్ అధికారులపైనా కక్ష సాధింపు..

- మున్సిపల్ అధికారులు, సిబ్బందిని తన గుప్పిట్లో పెట్టుకోవడానికి చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కక్షసాధింపులకు దిగారు. ప్రొటోకాల్ పేరుతో దూషణలు, బెదిరింపులతో భయకంపితులను చేస్తున్నారు.
- మున్సిపాలిటీలోని వ్యవహారాలన్నీ తన కనుసన్నల్లోనే జరగాలని, అధికారులందరూ తాను చెప్పినట్లే వినాలని హుకుం జారీ చేస్తున్నారు.
- మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అహంకారపూరిత ధోరణితో కమిషనర్ మొదలు కింది స్థాయి సిబ్బంది వరకు వృత్తిపరంగా అనేక రకాలుగా తీవ్ర ఒత్తిళ్లకు లోనవుతున్నారు.

ప్రశాంతతకు భంగం కలిగించేందుకే..

కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత తాడిపత్రి పట్టణ ప్రజలు స్వేచ్ఛా వాయువులను పీల్చుకుంటున్నారు. శాంతిభద్రతల విషయంలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. మూడు దశాబ్దాల తమ ఏక ఛత్రాధిపత్యానికి చెక్ పడటం జేసీ ప్రభాకర్‌రెడ్డికి మింగుడు పడలేదు. ఎలాగైనా తమ ప్రాభవం తిరిగి సంపాదించుకునేందుకు ఏదో ఒక అలజడి సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారు.

- ఇప్పుడు ఏకంగా ఓ సీఐ ఆత్మహత్యను అస్త్రంగా తెరపైకి తీసుకువచ్చి, అందుకు రాజకీయ రంగును పులుముతూ, పబ్బం గడుపుకోవాలని చూస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరసన తెలిపేందుకు చిహ్నంగా వాడే నల్లదుస్తులు, నల్ల రిబ్బన్లు ధరించి సీఐ ఆనందరావుకు నివాళులర్పించడం పట్ల కొన్ని దళిత సంఘాలతో పాటు తాడిపత్రి ప్రజలు తప్పుపడుతున్నారు. మరణించిన వ్యక్తి చిత్రపటానికి పూలు చల్లడం, పూలమాల వేయడం, లేదా కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టడం, వాటితో మానవహారం నిర్వహించడం వంటి చర్యలతో మృతి చెందిన వ్యక్తికి శ్రద్ధాంజలి, నివాళులర్పిస్తారు. అయితే సీఐ ఆనందరావు దళితుడైనందునే జేసీ ప్రభాకర్‌రెడ్డి నల్ల దుస్తులు ధరించి అగౌరవపరిచారని దళితులు కొందరు జేసీ తీరును తప్పుబట్టారు.

అనుచరుల కోసం చాంబర్..

మున్సిపల్ చైర్మన్ హోదాను అడ్డుపెట్టుకున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏ మున్సిపాలిటీలో లేని విధంగా రెండు చాంబర్లను ఆక్రమించుకున్నారు. అధికారుల వద్ద ఉండాల్సిన చాంబర్ల తాళాలను కూడా తనవద్దే ఉంచుకుంటున్నారు. బయటి వ్యక్తులు, అనుచరులు చైర్మన్ చాంబర్లలోకి వచ్చి వెళుతూ, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అనుచరులు కొందరు కార్యాలయంలోనే తిష్ట వేసి కార్యకలాపాలకు అడ్డుతగులుతున్నట్లు సిబ్బంది వాపోతున్నారు. జేసీ విపరీత పోకడలను తాళలేని సిబ్బంది మూకుమ్మడిగా సెలవుపై వెళ్లేందుకు నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిసింది.

అటానమస్ వైపు ఇంజినీరింగ్ కాలేజీల చూపు

- దరఖాస్తు చేసుకున్న ఆరు కళాశాలలు
- నూతన జాతీయ విద్యావిధానమే అటానమస్‌కు ఊతం

అనంతపురం: ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు అటానమస్ (స్వయం ప్రతిపత్తి) గుర్తింపు కోసం ఉత్సాహం కనబరుస్తున్నాయి. నూతన జాతీయ విద్యావిధానం–2020 ప్రకారం ప్రతి కళాశాల అటానమస్ హోదా పొందేలా తీర్చిదిద్దాలని పేర్కొనడం ఇందుకు ఊతమిస్తోంది. అటానమస్ హోదా తెచ్చుకునే కళాశాలలు అధికమయ్యే కొద్దీ యూనివర్సిటీ ప్రాభవం తగ్గుముఖం పడుతుంది. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఆరు (నెల్లూరు , కర్నూలు, ప్రొద్దుటూరులో ఒక్కో ఇంజినీరింగ్ కళాశాల, చిత్తూరు జిల్లాలో రెండు ఇంజినీరింగ్ కళాశాలలు, రాజంపేటలో ఒక ఫార్మసీ) కళాశాలలు 2023–24 విద్యా సంవత్సరంలో అటానమస్ హోదాకు దరఖాస్తు చేశాయి. న్యాక్ అక్రిడిటేషన్–ఏ గ్రేడ్ కూడా ఉండడంతో అటానమస్ హోదా దక్కడం లాంఛనమే కానుంది. జేఎన్‌టీయూఏ పరిధిలో మొత్తం 129 ఇంజినీరింగ్ కళాశాలలు ఉండగా, ఇందులో ఇప్పటికే 26 ఇంజినీరింగ్ కళాశాలలు, 2 ఫార్మసీ కళాశాలలు అటానమస్ హోదాలో ఉన్నాయి. మరో 5 ఇంజినీరింగ్, ఒక ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా దక్కితే మిగిలిన 95 కళాశాలలు యూనివర్సిటీకి అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలుగా ఉండనున్నాయి.

అటానమస్ హోదా దక్కితే..

అటానమస్ హోదా దక్కితే సిలబస్, ప్రశ్నపత్రాల రూపకల్పన, పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, మార్కుల నమోదు తదితర అంశాల్లో స్వతంత్రంగా వ్యవహరించవచ్చు. డిగ్రీ మాత్రమే యూనివర్సిటీ ప్రదానం చేస్తుంది. సొంత కోర్సులు నిర్వహించుకునే స్వేచ్ఛ ఉంటుంది. అయితే ఏఐసీటీఈ నిబంధనలకు లోబడే వ్యవహరించాల్సి ఉంటుంది.

45 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు

రాప్తాడురూరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో అర్హులైన 45 మంది ఎస్జీ కేడర్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. బుధవారం అనంతపురం సైన్స్ సెంటర్‌లో డీఈఓ సాయిరామ్ ఆధ్వర్యంలో పదోన్నతుల కౌన్సెలింగ్ జరిగింది. 22 మంది పీఈటీలకు ఫిజికల్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్‌కు సంబంధించి 14 మందికి గాను ముగ్గురు నాట్ ఆప్టెడ్ ఇచ్చారు. 11 మందికి పదోన్నతులు కల్పించారు. ఇక ఎస్‌ఏ గణితానికి సంబంధించి గణితం ఉర్దూ, వీహెచ్ కేటగిరీలో అభ్యర్థులు లేరు. తక్కిన 12 మందికి పదోన్నతులు కల్పించారు. కౌన్సెలింగ్ కార్యక్రమంలో ఏడీ కృష్ణయ్య, సూపరింటెండెంట్లు ఆదినారాయణ, శ్రీనాథ్, ప్రదీప్, పార్థసారథి, వంశీ, సత్యసాయి జిల్లా సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం



సభా స్థలిని పరిశీలిస్తున్న మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, విప్ కాపు, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్, ఎస్పీ



రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న మంత్రులు

- జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సభను విజయవంతం చేద్దామని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు మంగమ్మ, వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్డీఓ నిశాంత్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రైతు దినోత్సవం సందర్భంగా ఈ నెల ఎనిమిదో తేదీన కళ్యాణదుర్గం వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పంటల బీమా సొమ్ము విడుదల చేయనున్నారన్నారు. రైతుల సంక్షేమానికి జగన్ సర్కారు కృషి చేస్తోందన్నారు. రైతు పక్షపాతిగా ధరల స్థిరీకరణ నిధికి రూ.3 వేల కోట్ల కేటాయించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించారన్నారు. సీఎం సభను విజయవంతం చేయడానికి అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చేలా చూడాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ముమ్మరంగా ఏర్పాట్లు..

కళ్యాణదుర్గంలో ఎనిమిదో తేదీ సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. బహిరంగ సభా స్థలి, హెలిప్యాడ్ వద్ద బారికేడ్లు, వీఐపీ గ్యాలరీ ఏర్పాట్లను మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్‌తో పాటు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ కేతన్‌గార్గ్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎంఆర్‌సీ రెడ్డి బుధవారం పరిశీలించారు. పొరపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, మైనార్టీ నాయకుడు ఫయాజ్, ఏడీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, నాయకులు వీఆర్ రామిరెడ్డి, నర్సేగౌడ్ పాల్గొన్నారు.

శభాష్.. పోచమ్మ

- దివ్యాంగుల బోగీలో సీటు ఇవ్వకుండా ఆకతాయిల అడ్డగింపు
- 'దిశ' ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసి సాయం కోరిన బాధితురాలు
- గుంతకల్లుకు రాగానే ఆకతాయిలకు బుద్ధి చెప్పిన పోలీసులు

అనంతపురం సిటీ: అది హౌరా–యశ్వంత్‌పూర్ వెళ్లే రైలు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి విశాఖపట్నం వెళ్లాలని పోచమ్మ అనే దివ్యాంగురాలు బుధవారం రైలు ఎక్కారు. అయితే తమకు కేటాయించిన బోగీ ఎక్కిన ఆమెకు చేదు అనుభవం ఎదురైంది. తనకు సీటు ఇవ్వకుండా కొందరు ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేశారు. వెంటనే ఆమె 'దిశ' ఎస్‌ఓఎస్‌కు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం చేరవేశారు. వెంటనే స్పందించిన 'దిశ' బృందం రైలు ఎక్కడొస్తోందో లొకేషన్ ఆధారంగా గుర్తించారు. గుంతకల్లు సమీపంలో రైలు ఉందని తెలుసుకున్న పోలీసులు క్షణాల్లో అక్కడికి చేరుకున్నారు. రైలొచ్చి ఆగగానే బాధితురాలు పోచమ్మను పోలీసులు కలుసుకున్నారు. ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. ఆకతాయిలు తనకు ఎలా ఇబ్బంది పెట్టారో చెప్పి కన్నీటిపర్యంతమయ్యారు. అక్కడే ఆకతాయిలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ తరువాత ఆమెకు సీటు ఇప్పించి, సుఖంగా ప్రయాణం చేసేలా చర్యలు తీసుకున్నారు.

రథోత్సవం.. నేత్రపర్వం



అశేష భక్త జనసందోహం నడుమ ముందుకు సాగుతున్న రథం

ఉరవకొండ(విడపనకల్లు): గడేకల్లులో జీవసమాధి అయిన వేములవాడ భీమలింగేశ్వర స్వామి మహారథోత్సవం బుధవారం అశేష భక్త జన సందోహం నడుమ నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి రథం చుట్టూ సంప్రదాయబద్ధంగా ప్రదక్షిణలు చేయించారు. విశేష పూలు, మామిడితోరణాలతో అలంకరించిన మహారథాన్ని భక్తులు భీమలింగేశ్వర పాహిమాం పాహిమాం అంటూ ముందుకు లాగారు. ఎదరుబసవన్న గుడి వరకు రథాన్ని లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఏపీ, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ శ్రీనివాసులు, విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పవతి, జెడ్పీటీసీ సభ్యుడు హనమంతు, సర్పంచ్ సుశీల, కరణం భీమిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ భరత్‌రెడ్డి, మండల కన్వీనర్ బసన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు మేకల పంపాపతి, ఉమామహేశ్వర్, హేమంత్, ప్రసాద్, హంపయ్య, లింగన్న, అశోక్‌రెడ్డి, సురేష్, భీమేష్ తదితరులు ఉన్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

చెంతకే పౌష్టికాహారం

- అంగన్‌వాడీలో సమూల మార్పులు
- వచ్చే నెల నుంచి పాత పద్ధతిలోనే టీహెచ్‌ఆర్ అమలు
- లబ్ధిదారుల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకున్న జగనన్న సర్కారు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

రాయదుర్గం: మాతాశిశు సంరక్షణ, పూర్వప్రాథమిక విద్య పటిష్టతపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆంగ్ల మాధ్యమంలో పూర్వ ప్రాథమిక విద్య (ప్రీస్కూల్)ను అమలు చేస్తోంది. అలాగే గర్భిణులు, బాలింతలకు నెలలో 25 రోజులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ (అటుకులు, రాగిపిండి, జొన్నపిండి, కందిపప్పు ఒక్కో కిలో, బెల్లం, చిక్కీలు, ఎండు ఖర్జూరం పావు కిలో చొప్పున) కిట్లను అందజేస్తోంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ (చిరుధాన్యాల మిశ్రమ గోధుమపిండి 2 కిలోలు, చిక్కీలు, ఎండు ఖర్జూరం, బెల్లం, రాగి పిండి ఒక్కొక్కటి అర కిలో చొప్పున) కిట్ పంపిణీ చేస్తోంది. అంతేకాక మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రంలోనే పూర్వప్రాథమిక విద్య విద్యార్థుల (3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు)తో కలిసి గర్భిణులకు పోషకాలతో కూడిన వేడివేడి భోజనం, పాలు, కోడిగుడ్లు కూడా అందిస్తోంది.

కేంద్రాలకు రాలేని వారి కోసం..

గర్భిణులకు నెలలు నిండడం, ఇతర ఆరోగ్య సమస్యలు, బాలింతలకు చిన్నారుల సంరక్షణ వంటి వాటి కారణాలతో 300 నుంచి 500 మీటర్ల దూరంలో ఉండే అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడం కష్టమైంది. ఈ క్రమంలో క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుల ఇబ్బందులు తెలుసుకునేలా ముందుగా సర్వే చేపట్టింది. కేంద్రాలకు వచ్చి భోజనం చేస్తారా? లేదా సరుకులు ఇంటికే తీసుకెళతారా? అనే అంశాలపై అభిప్రాయాలు సేకరించారు. ఉన్నతాధికారులు కొందరు లబ్ధిదారులకే ఫోన్ చేసి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఎక్కువ మంది ఇంటికే ఇస్తే బాగుంటుందనడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో గర్భిణులకు జూలై ఒకటి నుంచి భోజనం పెట్టడం కుదరనందున టేక్ హోమ్ కేర్ విధానంలో 3 కిలోల బియ్యం, కిలో బేడలు, అరకిలో వంటనూనెతో పాటు 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు అనుబంధ పోషకాహారం కింద 2.5 కిలోల బాలామృతం, 2.5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు ఇంటికే అందిస్తారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	2,302
7 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారుల సంఖ్య	1,03,152
గర్భిణుల సంఖ్య	18,428
బాలింతల సంఖ్య	16,558

ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతున్నాయి. తాజాగా అంగన్‌వాడీలో సమూల మార్పులకు జగనన్న సర్కారు శ్రీకారం చుట్టింది. గర్భిణులు, బాలింతలు, ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులకు పౌష్టికాహారాన్ని పాత పద్ధతిలో ఇంటి వద్దకే చేర్చేందుకు చర్యలు తీసుకుంది. ఆగస్టు నెల నుంచి ఈ విధానం అమలు కానుంది.

చాలా సంతోషంగా ఉంది



కేంద్రాల వద్దకే వెళ్లి భోజనం చేయాలంటే సమయం వీలుపడక కొన్ని సందర్భాల్లో ఇబ్బంది పడ్డాం. ముఖ్యంగా నెలలు నిండే కొద్ది గర్భిణులు, పసి పిల్లలున్న బాలింతలు కేంద్రాలకు వెళ్లడం సాధ్యపడడం లేదు. ఇదే విషయాన్ని ఇటీవల సర్వే అధికారులకు వివరించాం. మా అభిప్రాయానికే ప్రభుత్వం మొగ్గు చూపడం సంతోషంగా ఉంది. సీఎం జగన్‌కు మహిళలు, చిన్నారులు రుణపడి ఉంటారు.

– శ్రీదేవి, గర్భిణి, ఓబుళాపురం, డి హీరేహాళ్ మండలం

రెండు విడతలుగా పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాల్లో వండిపెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని తొలగించి పాత పద్ధతిలో ఇళ్లకే సరుకులు అందించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీలోపు మొదటి విడతగా బియ్యం, కందిపప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు, రాగిపిండి, అటుకులు, బెల్లం, చిక్కీలు, ఖర్జూరం అందిస్తారు. అలాగే 16, 17 తేదీల్లో రెండో విడతగా కోడిగుడ్లు, పాలు అందజేసేలా ప్రణాళికలు రూపొందించాం.

– శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ, అనంతపురం



వివాహిత బలవన్మరణం



సురేశ్వరమ్మ (ఫైల్)

యాడికి: జీవితంపై విరక్తితో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం లక్షుంపల్లికి చెందిన రామసుబ్బయ్య కుమార్తె సురేశ్వరమ్మ(30)కు పదేళ్ల క్రితం యాడికి మండలం వెంగన్నపల్లి నివాసి సుబ్బరాయుడు కుమారుడు రమేష్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడున్నారు. మంగళవారం పిల్లలు ఎక్కువగా అల్లరి చేస్తుంటే తల్లి మందలిస్తుండగా నాన్నమ్మ లక్ష్మీదేవి జోక్యం చేసుకుని కోడలికి నచ్చచెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన సురేశ్వరమ్మ అదే రోజు రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు నిద్ర లేచిన కుటుంబసభ్యులు ఉరికి విగత జీవిగా వేలాడుతున్న సురేశ్వరమ్మను గమనించి కిందకు దింపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి తండ్రి రామసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు.

సేతు స్కూల్‌లో చోరీ

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: స్థానిక నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్‌లో ఉన్న సేతు స్కూల్‌లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. మంగళవారం ఉదయం స్కూల్‌లో అడ్మిషన్లు పెద్ద ఎత్తున జరిగాయి. ఆ సమయంలో తల్లిదండ్రులు చెల్లించిన ఫీజులను లాకర్‌లో ఉంచి పాఠశాలకు తాళం వేసుకుని ప్రిన్సిపాల్ షబానా, సిబ్బంది ఇళ్లకు వెళ్లారు. బుధవారం తెల్లవారుజామున దుండగులు పాఠశాలలోకి చొరబడి కరస్పాండెంట్ గది తలుపులకు ఉన్న తాళాలను బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. అనంతరం సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, లాకర్‌లోని రూ.4 లక్షలకు పైగా నగదును అపహరించుకెళ్లారు. బుధవారం ఉదయం పాఠశాలకు చేరుకున్న ప్రిన్సిపాల్ షబానా.. చోరీ విషయాన్ని గుర్తించి యాజమాన్యం ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. నాల్గో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను, స్నిఫ్పర్ డాగ్‌ను రంగంలో దించి ఆధారాలు సేకరించి, కేసు నమోదు చేశారు.

ఇంటి దొంగల పనేనా?

పాఠశాల కరస్పాండెంట్ గదిలోని సీసీ కెమెరా ఫుటేజీలను కావాలనే నాశనం చేయడం చూస్తుంటే చోరీ ఇంటి దొంగల పనే అనే అనుమానాలను పలువురు వ్యక్త పరిచారు. తలుపుల తాళాలు పగలగొట్టిన దొంగలు నేరుగా కరస్పాండెంట్ గదిలోని లాకర్ వద్దకెళ్లి లాకర్‌ను బ్రేక్ చేయడం అనుమానాలకు ఊతమిచ్చింది. అయితే సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో దృశ్యాలు సరిగా కనిపించలేదు. దీంతో డీవీఆర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని అందులోని దృశ్యాలను రికవరీ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

రూ.2 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

- డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) టర్నోవర్ రూ.2 వేల కోట్లకు చేరుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని, ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత అన్నారు. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి సంబంధించి బ్యాంక్ లావాదేవీలపై బ్రాంచి మేనేజర్లతో స్థానిక డీసీసీబీ హాలులో బుధవారం ఆమె సమీక్షించారు. ప్రస్తుతం రూ.1,700 కోట్ల లావాదేవీలతో నడుస్తోందన్నారు. నెలవారీగా ప్రణాళికను రూపొందించుకుని లక్ష్య సాధన దిశగా నడిపించే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. నిరర్ధక ఆస్తులను (ఎన్‌పీఏ) 13 శాతం నుంచి 5 శాతం లోపు ఉండేలా మొండిబకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులు, మహిళలు, జేఎల్‌జీ గ్రూపులకు, బంగారు నగల తాకట్టుకు విరివిగా రుణాలు ఇవ్వడంతో పాటు ప్రజలను చైతన్య పరిచి పెద్ద ఎత్తున డిపాజిట్లను సేకరించాలన్నారు. సమీక్షలో సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, జీఎం కె.సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవబాబు, రవికుమార్, నాబార్డు డీడీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గిరినాథరెడ్డి సూపర్ సెంచరీ



గిరినాథరెడ్డి



మమత

అనంతపురం: సీనియర్ అంతర జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా బుధవారం ఆర్డీటీ క్రీడా మైదానంలో అనంతపురం, కడప జట్ల మధ్య మల్టీ డే మ్యాచ్ జరిగింది. అనంతపురం జట్టు బ్యాటర్ గిరినాథరెడ్డి సూపర్ సెంచరీతో అదరగొట్టాడు. అనంతపురం మొదటి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లకు గాను 369 పరుగులు సాధించి ఆలౌట్ అయ్యింది. పి.గిరినాథ్ రెడ్డి 110 బంతుల్లో (13 ఫోర్లు, 5 సిక్సర్లు) 121 పరుగులు చేశాడు. ఆల్‌రౌండర్ బీఎస్ వినయ్‌కుమార్ 133 బంతుల్లో 77 పరుగులు (9 ఫోర్లు, 3 సిక్సర్లు) చేశాడు. కడప మొదటి ఇన్నింగ్స్‌లో 4 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 10 పరుగులు చేసింది.

సీనియర్ జట్టు విజయం: అండర్–19 మహిళల క్రికెట్ జట్టు ఎంపికకు సంబంధించి నిర్వహించిన మ్యాచ్‌లో ప్రతిభ చాటారు. అనంతపురం అండర్–19 జట్టు 44.4 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఇందులో బి. నేహా 41 పరుగులు, బి.అమూల్య 47 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం మహిళల సీనియర్ జట్టు 23. 2 ఓవర్లలోనే రెండు వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. సీనియర్ జట్టులో బ్యాటర్ మమత 66 పరుగులు (72 బంతుల్లో 5 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడింది. గురువారం అండర్–19, సీనియర్ టీం మధ్య మరో మ్యాచ్ జరగనుంది.

రాగి సాగు విస్తీర్ణం పెరగాలి

- శ్రీసత్యసాయి జిల్లా జేసీ చేతన్



అధికారులతో మాట్లాడుతున్న జేసీ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో రాగి పంట సాగు విస్తీర్ణం మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను శ్రీసత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశించారు. రాగి పంట సాగుపై వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమీక్షించారు. చౌకదుకాణాల్లో కార్డుదారులకు అందజేయడానికి రాగులు చాలా అవసరమన్నారు. ఈ క్రమంలో రాగి పంటకు ప్రభుత్వం రూ.3,846 కనీస మద్దతు ధర కల్పిస్తోందన్నారు. ఈ విషయాన్ని రైతులకు వివరించి రాగి పంట సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. రాగి పంట సాగు చేసిన రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో సీడ్, మినీ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. విత్తన పంపిణీని జాగ్రత్తగా చేపట్టాలన్నారు. కౌలు రైతులకు జగనన్న సురక్ష కార్యక్రమంలో సీసీఆర్సీలను అందజేయాలన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి, డీఎం అశ్వత్థ నారాయణ నాయక్, ఏపీ సీడ్స్ డీఎం ధనలక్ష్మి, ఏడీఏలు రవీంద్ర, కృష్ణమీనన్, స్వయం ప్రభ పాల్గొన్నారు.

పామిడి హౌసింగ్ ఏఈకి రాష్ట్ర స్థాయి అవార్డు



హౌసింగ్ ఏఈ అశ్వత్థ నారాయణను సన్మానిస్తున్న దృశ్యం

పామిడి: గృహ నిర్మాణ పథకం అమలులో పామిడి మండలంలో ముందంజలో ఉండేలా కృషి చేసిన హౌసింగ్ ఏఈ అశ్వత్థనారాయణకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఏఈ అవార్డు దక్కింది. గృహ నిర్మాణ సంస్థ వార్షికోత్సవంలో భాగంగా అవార్డును ఆ శాఖ పీడీ కేశవనాయుడు చేతుల మీదుగా బుధవారం ఆయన అందుకున్నారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం క్రైం: పారా మెడికల్ కోర్సుల్లో శిక్షణకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి డీఎంఎల్‌టీ, డీఓఏ, డీఏఎన్ఏస్, డీఎంఐటీ, డీఇసీటీ, డీఆర్‌జీఏ, డీడీఆర్‌ఏ కోర్సులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు www.appmb.org.in, http://dme.ap.nic.in, www.appmb.co.in వెబ్‌సైట్‌లను సందర్శించాలని సూచించారు.

వ్యక్తి దుర్మరణం

పావగడ: వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకాలోని కేటీహళ్లికి చెందిన నరసింహమూర్తి (46) బుధవారం ఉదయం మంగళవాడ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మంగళవాడలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలుపుతుండగా వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నరసింహమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న అరిసికెర ఎస్‌ఐ ధారాసింగ్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మెరుగైన వైద్యం అందించండి

- జిల్లాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: హిందూపురంలోని జిల్లా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రి లోపల, బయట పరిశుభ్రతను పాటించాలన్నారు. ఇందు కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలోని రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. ప్రతి కొనుగోలుకు సంబంధించిన వివరాలు రికార్డులో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రహరీని పడగొట్టే విషయం పరిశీలించాలని డీసీహెచ్‌ఎస్‌ను ఆదేశించారు. నేమ్ బోర్డు ఏర్పాటుకు దాతల సహకారం తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగిరెడ్డి మాట్లాడుతూ.. డ్రిల్లింగ్ మిషన్ ఏర్పాటు చేయాలని, గార్బేజ్, బయోవేస్ట్ ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. సిబ్బందికి వాష్‌రూంలు ఏర్పాటు చేయాలన్నారు. డ్యూటీ డాక్టర్ల సమయ వేళలు ప్రదర్శించాలని, రాత్రి పూట డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సిటీ స్కానింగ్ మిషన్, ఆర్థోపెడిక్ డ్రిల్లింగ్ మిషన్, ఐటీటీ సర్జన్ చైర్, ఇంటర్నెట్ కనెక్షన్, ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్, ఆక్సిజన్ రీఫిల్లింగ్, ల్యాబ్ ఐటమ్స్ కొనుగోలుకు కమిటీ ఆమోదం తెలిపింది. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎంటీ నాయక్, జిల్లా స్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్‌కుమార్, ఆర్ఎంఓ రుక్మిణమ్మ, హెడ్ నర్స్ సౌదామిని, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సుదర్శన్, శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నాగ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పక్కాగా జగనన్న సురక్ష సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయ్ ప్రసాద్

ఆత్మకూరు: జగనన్న సురక్ష సర్వేను పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ విజయ్ ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని ఆత్మకూరు, పి.యాలేరు సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రజలు సమస్యలు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం అందజేసే 11 రకాల ధ్రువీకరణ పత్రాలను వివరించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అందాయా ? లేదా ? నగదు రాకుండా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకోవాలన్నారు. సమస్యలను నమోదు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంటి స్థలాలు, ప్రభుత్వ ఇళ్లకు సంభందించి వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాల పోతన్న, యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, పి.యాలేరు సర్పంచ్ ఆరోగ్యంరెడ్డి, నాయకులు వెంకట్రాముడు, అతికిరెడ్డి, వన్నూరప్ప, ఆత్మకూరు సచివాలయ కన్వీనర్ ఓబీ టైలర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.86,809 రికవరీకి ఆదేశం



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

చెన్నేకొత్తపల్లి: మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి రూ.86,809 రికవరీకి ఆదేశించినట్లు ఎస్ఆర్‌పీ నాగర్జున తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాయలంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 15 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల వివరాలను సీఆర్‌పీలు చదివి వివరించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ రామాంజినేయులు మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరంలో 937 పనులకు గాను రూ.12 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగావతి, ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి పలువురు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం



బంద్‌లో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు

రాప్తాడురూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం తలపెట్టిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. నగరంలో వివిధ స్కూళ్లను ఏబీవీపీ నాయకులు బంద్ చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జయచంద్ర మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రైవేట్ పాఠశాల, కార్పొరేట్ పాఠశాలల్లో యూనిఫాం, పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి తేజ, నగర ఉపాధ్యక్షులు కమలాకర్, భరత్, సాయి, తిమ్మరాజు, అఖిలేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి



పార్కులో మొక్కలను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ సందీప్ కృపాకర్

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ మెక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని డీఎఫ్ఓ సందీప్ కృపాకర్ అన్నారు. బుధవారం మండలంలోని పంపనూరు వద్ద ఉన్న సిటీ పార్కును సందర్శించారు. పార్కులోని మొక్కలు, చెట్లను పరిశీలించారు. మొక్కలు లేని చోట మెక్కలు నాటాలని అటవీశాఖ సిబ్బందికి సూచించారు. అంతేకాకుండా పార్కులో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పార్కులోకి వచ్చే వారి వివరాలు కచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. రికార్డులు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ శ్రీనివాసులు, ఎఫ్ఎస్ఓ నారపరెడ్డి, ఎఫ్‌బీఓ దామోదర్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

యాడికి: గంగాదేవిపల్లెకు చెందిన లక్ష్మీనారాయణ ట్రాక్టర్‌లో తాడిపత్రి మండలం పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వేములపాడు రహదారిలో బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేశామన్నారు.

ఇళ్ల స్థలాలకు రూ.62 కోట్ల మంజూరు

- కామారుపల్లి లబ్ధిదారులకు వేరే చోట స్థలాల కేటాయింపునకు చర్యలు
- అర్హులందరికీ న్యాయం చేస్తాం
- 'జగనన్న సురక్ష'లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు దోచుకున్నాయి. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి పేద, మధ్య తరగతి ప్రజల భవిష్యత్తు కోసం పెద్ద ఎత్తున సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని మంగళవారి కాలనీ, బోయ వీధి, రుద్రంపేటలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలపై ఆర్థిక భారం పడకుండా వారి పిల్లలు చదువుకునేందుకు అమ్మ ఒడి, జగనన్న విద్యా, వసతి దీవెన పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ తరహాలో సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కొందరు వారి పిల్లలకు చిరు ఉద్యోగాలొచ్చి వేరే కుటుంబాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నట్లు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. అర్హతలున్నా.. పథకాలు అందడం లేదని చెప్పారని వెల్లడించారు. ఇదే విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. అందరికీ మేలు చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు.

సదరం క్యాంపుల ఏర్పాటుకు చర్యలు

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 సేవలతో పాటు ఇతర సదరం, తదితర సమస్యలను జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఆదేశించారు. నియోజకవర్గంలోని అర్హులైన వికలాంగులకు సదరం సర్టిఫికెట్లు మంజూరు చేసేందుకు త్వరలో సదరం క్యాంపులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

23 వేల మందికి ఇళ్ల స్థలాలు అందించాం..

నియోజకవర్గంలో 23 వేల మందికి ఇళ్ల స్థలాలు అందించామన్నారు. కామారుపల్లి స్థలంలో నీరు ఊరుతోందని, అక్కడ ఇళ్లు మంజూరైన 6,930 మందికి మరో అనువైన ప్రాంతంలో కేటాయింపునకు స్థలం కావాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. స్థలం కేటాయింపునకు రూ.62 కోట్లు మంజూరు చేశారని వెల్లడించారు. త్వరలోనే పాత పట్టాలను వెనక్కు తీసుకుని కురుకుంట, కొడిమి, రాచానపల్లి ప్రాంతాల్లో ఇంటి స్థలాలు అందజేస్తామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం, అప్పటి ప్రజాప్రతినిధులు టిడ్కో ఇంటి పేరుతో మోసం చేసి, 8 వేల మందితో డబ్బులు కట్టించుకున్నారన్నారు. కేవలం రూ.500 కట్టిన వారికి స్థలం కేటాయించి, మిగతా 6 వేల మందికి స్థలాలు చూపించలేదన్నారు. రూ.500 కట్టి, ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న 2,304 మందికి త్వరలో టిడ్కో ఇళ్లు అందిస్తామన్నారు. మిగతా వారందరికీ జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించామన్నారు. నగరంలో రూ.600 కోట్ల అభివృద్ధి జరిగిందని వెల్లడించారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు.

అభివృద్ధి చేసి ఓర్వలేక ప్రతిపక్షాల విమర్శలు

మంచి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు రాష్ట్రం అప్పులపాలవుతోందంటూ విమర్శలు చేస్తున్నాయన్నారు. గతంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఎందుకు సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించలేదని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మినీ మేనిఫెస్టోతో ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు నాయుడు కుట్రలు పనుతున్నారన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, సర్పంచ్ పద్మావతి, కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు లావణ్య, కొండ్రెడ్డి రాధా, రమాదేవి, లీలావతి, ఎంపీటీసీలు మహబూబీ, నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్ ఇచ్చారు



గతంలో క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్ల కోసం మీ సేవ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయాం. దరఖాస్తు చేసుకున్న చాలా రోజులకు సర్టిఫికెట్లు వచ్చేవి. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత పథకాల మంజూరుకు క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు అవసరం అయ్యాయి. ఇటీవల ఇంటి వద్దకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు అందజేయడం సంతోషంగా ఉంది.

– మున్నీ, బోయ వీధి

ప్రభుత్వ సేవలు భేష్..



గతంలో చాలా ప్రభుత్వాలను చూశాం. ఏదైనా పథకం రావాలంటే ప్రజాప్రతినిధులు, నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వచ్చి సేవలందిస్తున్నారు. బాబుకు అమ్మఒడి, మా అమ్మకు చేయూత, తదితర పథకాలు వస్తున్నాయి. ఆధార్ లింక్ చేసుకునేందుకు ఇక్కడి వచ్చా. అదే ప్రైవేట్‌గా తీసుకోవాలంటే రూ.100 ఖర్చు అవుతుంది. అటువంటిది ఉచితంగా తక్కువ సమయంలో ఆధార్ మొబైల్ లింక్ చేస్తున్నారు. ఇంతటి సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వాన్ని చూడలేదు. సీఎం జగన్ సర్‌కు రుణపడి ఉంటాం. – రాజేష్ (ట్యాక్సీ డ్రైవర్, 20వ డివిజన్)

మరిగించిన నూనెను మళ్లీ వాడితే చర్యలు



టీపీసీ కౌంట్‌ను పరీక్షిస్తున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తస్లీం

అనంతపురం క్రైం: జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశాలతో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి.తస్లీం బుధవారం నగరంలోని కొన్ని హోటళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటళ్లలో వాడుతున్న నూనెను టోటల్ పోలార్ కాంపౌడ్స్ (టీపీసీ) పరికరం ద్వారా పరీక్షలు చేశారు. వివిధ హోటళ్లలో టీపీసీ రీడింగ్ 25 శాతం లోపలే వచ్చింది. ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి.తస్లీం మాట్లాడుతూ.. హోటల్ నిర్వాహకులు నల్లగా మారిన నూనెను వాడకూడదన్నారు అతిగా వినియోగించిన నూనెను మళ్లీ వాడితే కేన్సర్ తదితర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. నల్లగా మారిన నూనెను బయో డీజిల్ తయారీకి సంబంధిత కంపెనీ నిర్వాహకులకు అందజేయాలని ఆదేశించారు. ముఖ్యంగా టీపీసీ రీడింగ్ 25 శాతం కంటే తక్కువగా ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలసిన ఎంపీ రంగయ్య



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ తలారి రంగయ్య



సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి

అనంతపురం క్రైం: ఢిల్లీ విమానాశ్రయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం ఎంపీ తలారి రంగయ్య, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులు

పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నా ఫలితం దక్కడం లేదు. అనంతపురం బైపాస్, వివిధ సర్కిళ్లలో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నారు. అయినా వాహనదారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. అతివేగంతో వాహనాలను నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. రాంగ్ రూట్‌లో వెళ్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. క్రాసింగ్‌ల వద్ద సిగ్నల్స్ జంప్ చేస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. బుధవారం రాప్తాడు, తపోవనం సర్కిల్, బైపాస్‌ల వద్ద పలువురు వాహనదారులు నిబంధనలు అతిక్రమించారు. స్పీడుగా వెళ్లడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న దృశ్యాలను 'సాక్షి'క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



దేంజర్ జోన్: రాప్తాడు సర్కిల్‌లో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు



మా రూటే సపరేట్: తపోవనం వద్ద రాంగ్ రూట్‌లో వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు



నిబంధనలు పాటించండి-క్షేమంగా ఉండండి: బైపాస్‌లో క్రాసింగ్‌ల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న పోలీసులు



మేమింతే: సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడుపుతున్న దృశ్యం

ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యం



సూచిక బోర్డుల ఏర్పాటును పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: సురక్షిత ప్రయాణం కోసం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ వెంకటేష్ నాయక్ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రతి కూడలిలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ప్రమాదాలను నియంత్రించడమే కాకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. అనంత నగరం అనగానే ఇతర ప్రాంతాల వారికి అక్కడి ప్రజలు ట్రాఫిక్ ఆంక్షలను చక్కగా పాటిస్తారన్న గుర్తింపు తీసుకువస్తామన్నారు. అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డితో పాటు ఎస్పీ కె.శ్రీనివాసరావు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల సూచనలను ఆచరణలో పెడుతామన్నారు. వాహనదారులు క్రమ పద్ధతిలో వాహనాలను నడిపేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోలీసులు చేస్తున్న ఈ ప్రయత్నానికి అందరూ సహకరించాలని సూచించారు. సీటు బెల్ట్ ప్రయాణం ఎంత సురక్షితమో ఈ సూచిక బోర్డు చెబుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఒక్క నిమిషం ఈ బోర్డులోని అంశాలను చదివి మీ ప్రయాణాన్ని సాగించాలని కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

పెద్దవడుగూరు : ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. గుత్తిఅనంతపురం గ్రామానికి చెందిన పుంజా వెంకట్రాముడు(34)కు 12 ఏళ్లక్రితం పెద్దవడుగూరు కి చెందిన లక్ష్మీదేవి వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. భార్యఅనారోగ్యంతో మృతి చెందింది. తర్వాత వెంకట్రాముడికి గుత్తి మండలం కొత్తపల్లికి చెందిన రామలక్ష్మీతో వివాహం జరిగింది. కొద్ది రోజులకు ఆమె క్యాన్సర్ సోకడంతో అప్పు చేసి వైద్యం చేయించాడు. అయినా ఆరోగ్యం కుదుట పడక రెండేళ్ల క్రితం మరణించింది. వీరికి ఇద్దరు కుమార్తలున్నారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురై ఈనెల 3న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఊజీ మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత అనంతపురం తరలించారు. చికిత్స ఫలించక పోవడంతో అక్కడే మృతి చెందాడు.

బాలుడిపై కుక్క దాడి

గుత్తి: కొత్తపేటలో మూడేళ్ల బాలుడిపై బుధవారం కుక్క దాడి చేసింది. గ్రామానికి చెందిన దగ్గు ఖాన్, షాహీనా దంపతుల కుమారుడు ఇజాజ్ ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్క కరిచింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పదోన్నతులు కల్పించాలి

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్‌లో సీనియర్ సహాయకులకు పరిపాలనాధికారులుగా పదోన్నతులు కల్పించాలి. సీనియారిటీ కాపాడాలని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.నాగభూషణంరెడ్డి, కె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రాయలసీమలోని అన్ని జిల్లాల్లో పంచాయతీరాజ్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి, సీనియారిటీని కాపాడుతున్నారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం ఉందని ఆరోపించారు. ఈ విషయంపై జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డికి ఇటీవల వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. అయినా సీఈఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అర్హులైన ఉద్యోగులు జోనల్, మల్టీ జోనల్‌లో సీనియారిటీ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అన్ని క్యాడర్ల వారికి పదోన్నతులు కల్పించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఖాళీ ఏర్పడ్డ ఎనిమిది పోస్టుల్లో సీనియర్ సహాయకులకు పరిపాలనాధికారులు (ఏఓ)గా పదోన్నతులు కల్పించాల్సి ఉందన్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

వర్సిటీ పురోగతికి పూర్వ విద్యార్థుల సహకారం



జేఎన్‌టీయూఏ వీసీతో సమావేశమైన 1970 బ్యాచ్ పూర్వ విద్యార్థి శంకరనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పురోగతిలో పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో ఉందని వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్ధన అన్నారు. క్యాంపస్ కళాశాలలో 1970 సంవత్సరంలో బీఈ పూర్తి చేసిన పూర్వ విద్యార్థి శంకర నారాయణ వర్సిటీ ఉన్నతాధికారులతో బుధవారం సమావేశమయ్యారు. శంకరనారాయణ యూఎస్ఏలోని టెక్సాస్‌లో అత్యున్నత హోదాల్లో పని చేశారు. ఈనెల 7వ తేదీన 1970 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థులందరూ హాజరు కావాలని కోరారు. సాంకేతిక విజ్ఞానం మార్పు, సివిల్ సర్వీసెస్ శిక్షణ, యూనివర్సిటీ ఆఫ్ నార్త్‌లోవా, యూఎస్ఏ వారి సహకారానికి సంబంధించి ప్రణాళికలు ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్, ప్రొఫెసర్ వి.సుమలత, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో బీకేఎస్ విద్యార్థిని ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థినితో ఉపాధ్యాయులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కీర్తన అనే విద్యార్థి రాష్ట్రస్థాయి జూనియర్ బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. గత నెల 29 నుంచి ఈ నెల 2 వరకు ఏలూరు జిల్లా నూజివీడులో అంతర్ జిల్లాల అండర్–18 జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలు జరిగాయన్నారు. ఇందులో కీర్తన అనంతపురం జిల్లా జట్టు తృతీయ స్థానం సాధిండంలో కీలకపాత్ర పోషించిందిన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

'నీలకురింజి సముద్రం' పుస్తకావిష్కరణ రేపు

అనంతపురం కల్చరల్: సీనియర్ రచయిత్రి డాక్టర్ ప్రగతి రచించిన 'నీలకురింజి సముద్రం' కవిత్వ సంపుటిని ఈనెల 7వ తేదీన ఆర్ట్స్ కళాశాలలో ఆవిష్కరించనున్నారు. ముఖ్య అతిథులుగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్‌తో పాటూ విరసం నాయకుడు పాణి విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారు. సాహితీ అభిమానులు పుస్తకావిష్కరణ సభలో పాల్గొనాలని డాక్టర్ ప్రగతి కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి: జక్కల చెరువు గ్రామానికి చెందిన చిన్న రామక్క అనే మహిళ బుధవారం నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.